ప్రజాశక్తి
గురువారం 8 ఫిబ్రవరి 2024 5
అనంతపురం

మూగజీవాలతో వెళ్తున్న కంటైనర్ బోల్తా

ఇద్దరు వ్యక్తులు.. 35 ఆవులు మృతి

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌గేట్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. 40 ఆవులతో వెళ్తున్న ఓ కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కంటైనర్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు మరణించారు. 35 ఆవులూ మృత్యువాత పడ్డాయి.

కంటైనర్ వద్ద సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు

వార్త మెయిన్‌లో

శిక్షణ కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్నికల ప్రక్రియలో సెక్టోరియల్ అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, దీనిని అధికారులు అత్యంత బాధ్యతతో పనిచేయాలని కలెక్టర్ ఎం.గౌతమి సూచించారు. ఎన్నికలపై సెక్టోరియల్ అధికారులు, సెక్టోరియల్ పోలీస్ అధికారులు, ఈఆర్ఒలు, ఎఎల్ఎంటిలు, తహశీల్దార్లకు అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఆడిటోరియంలో బుధవారం నాడు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు, సెక్టోరియల్ పోలీస్ అధికారులు ఎన్నికల కమిషన్ సూచనలను వంద శాతం తూచా తప్పకుండా పాటించాల న్నారు. ప్రీ పోల్, పోలింగ్ రోజు చేపట్టాల్సిన చర్యలను జాగ్రత్తగా నిర్వహించా లన్నారు. అర్బన్ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా ఉందని, 2014, 2019 ఎన్నికల్లో ఏ ఏ పోలింగ్ స్టేషన్లలో తక్కువగా ఓటింగ్ నమోదయింది అన్న దానిపై తనిఖీ చేసి ఈ సారి పోలింగ్ శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులు అత్యంత శ్రద్ధతో చేపట్టాలన్నారు. ఎన్నికల్లో వాలంటీర్లకు ఎలాంటి పనులనూ అప్పగించ రాదన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో చేయాలన్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లా డుతూ సెక్టోరియల్ పోలీస్ అధికారులు సీజర్స్, ఎఫ్ఎస్‌టి, ఎంసిసి, స్టాటిక్ సర్వే లెన్స్ టీమ్లను ఏర్పాటు చేస్తుంటారన్నారు. ఎంసిసి కోడ్ అమలుపై దష్టి పెట్టాలన్నారు. అనుమతులు లేకుండా ప్రచారం చేయడం, డబ్బు పంపిణీ లాంటివి అరికట్టా లన్నారు. శిక్షణా కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, అడిషినల్ ఎస్పీ విజయ్ భాస్కర్ రెడ్డి, ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, రాణి సుస్మిత, వి.శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

'సిద్ధం' 18కి వాయిదా

షర్మిల భద్రత ఆమెదే : మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

రాయలసీమకు సంబంధించి రాప్తాడులో ఈ నెల 10వ తేదీ నిర్వహించతలపెట్టిన 'సిద్ధం' సభను ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిలకు భద్రత వారు సొంతంగా పెట్టుకోవాలని సూచించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు తమకు కూడా భద్రత తగ్గించారని, అయినా తాము ఎప్పుడూ అడగ లేదన్నారు. నగరంలోని రోడ్లు భవనాలు అతిథి గృహంలో బుధవారం సాయంత్రం మంత్రి విలేఖరుల సమా వేశంలో మట్లాడారు. గత ఎన్నికల్లో రాయలసీమ నుంచి అత్యధిక స్థానాలు సొంతం చేసు కున్నాం.. ఈ సభకు ప్రజలు భారీగా రావాలని కోరుతున్నామన్నారు. టిడిపి పొత్తులు పెట్టుకోవటం మేము ముందు నుంచి ఉహించిందే.. మా నాయకుడు సింగిల్‌గానే వస్తాడన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి జగన్ పాలన చేస్తున్నారని, కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు మంచి సేవలు అందించారన్నారు. ఇవన్నీ చూసి సిద్ధం సభకు ప్రజలు భారీగా తరలి వస్తున్నారన్నారు.



ఉసూరుమనిపించి..!

◆ పరిహారం ఊసేలేని బడ్జెట్..! ◆ సాగునీటికి అరకొరే.. ◆ రాష్ట్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ నిరాశే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ జిల్లాకు తీరని నిరాశనే మిగిల్చింది. గత బడ్జెట్‌ల మాదిరిగానే ఎలాంటి వ్యవసాయం, ప్రాజెక్టులు, చేనేత తదితర రంగాలకు సంబంధించి మొండి చేయినే చూపించింది. జిల్లాలో 2023లో తీవ్రమైన వర్షాభావం నెలకొన్న తరుణంలో పరిహారం ప్రస్తావన ఈ బడ్జెట్‌లో చేస్తారని రైతులు ఆశించారు. ప్రభుత్వం కరువు ప్రస్తావనేది లేకుండానే బడ్జెట్‌ను ముగించేసింది. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వస్తున్న సమయంలో కనీసం ప్రకటనైనా చేస్తుందని రైతులు ఎదురు చూశారు. వారి ఆశలపై ప్రభుత్వం నీళు జల్లింది. ఇక సాగునీటి రంగానికి అరకొర నిధులతోనే సరిపెట్టారు. హంద్రీనీవాకు రూ.122.69 కోట్లు, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రూ.193.17 కోట్లు కేటాయించారు. ఇవి సాధారణ వేతనాలకు కూడా సరిపోవు.

ఐదేళ్లలో ప్రాజెక్టులన్నీ పడకేనా. ?

2019-20 నుంచి చూస్తే జిల్లాలో సాగునీటి రంగాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలున్నాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహనరెడ్డి తొలిసారి అనంతపురం నగరంలో జరిగిన పర్యటనలోనే హామీనిచ్చారు. ఈ మేరకు టెండర్లు కూడా పిలిచారు. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. నిధుల కేటాయింపులు జరగలేదు. అంతకు మునుపు పెండింగులో ఉన్న పనులు కూడా ఈ ఐదేళ్లలో ముందుకు సాగలేదన్న విమర్శలున్నాయి. భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తామని ప్రకటించారు. రాయదుర్గం సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దీనిపై హామీనిచ్చారు. ఇటీవల కళ్యాణదుర్గం వచ్చినప్పుడు రూ.84 కోట్లు భూసేకరణకు నిధులు విడుదల చేశారు. అవి కూడా ఇప్పటికీ పూర్తిగా రైతులందకలేదు. పేరూరు ఎత్తిపోతల పథకంలో అదనంగా రెండు రిజర్వాయర్లను ఈ కాలంలో పూర్తి చేస్తామని కూడా ప్రకటన ఉంది. ఇప్పటికీ భూసేకరణకు నిధులు కేటాయించలేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తిగా ఆగిపోయింది. కనీసం మరమ్మతులకైనా రూ.30 కోట్లు ఇవ్వాలని చేసిన అధికారుల ప్రతిపాదనలు అటకెక్కాయి. ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపుల్లేక నిర్వహణ కూడా లేకుండాపోయింది. నీరొచ్చినప్పుడల్లా ఎక్కడ గండ్లు పడుతాయోనన్న గుబులు అందరిలోనూ నెలకొంది. వీటిన్నంటిపై ఓటాన్ బడ్జెట్‌లో ప్రస్తావిస్తారని రైతులు, ప్రజలు ఆశించారు. కానీ ఆ మేరకు ప్రభుత్వం నుంచి బడ్జెట్‌లో సానుకూల స్పందన రాకపోవడం జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది.

పరిహారం నామమాత్రమే..

బడ్జెట్‌లో పరిహారంపై రైతులు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆ దిశగా ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. 2023 సంవత్సరంలో వర్షాభావంతో రైతులు పంటలను తీవ్రంగా నష్టపోయారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. పంటనష్టాన్ని అంచనావేశారు. అనంతపురం జిల్లా పరిధిలో రూ.251 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వాస్తవంగా పంట నష్టం రూ.6వేల కోట్ల వరకు జరిగి ఉంటుందని రైతుసంఘాల నేతలు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నామమాత్రపు పరిహారంపై కూడా బడ్జెట్‌లో పూర్తి స్థాయి భరోసాను ఇచ్చే పరిస్థితి కన్పించలేదు. పట్టు రైతులు, చేనేత కార్మికులు, ఇతర వృత్తిదారులకు కూడా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదు. రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా నిధులు విడుదల పూర్తి స్థాయిలో జరగలేదు. ఓటాన్ బడ్జెట్ వల్ల జిల్లాకు వనగూరిన లాభం ఏమీ లేదనే భావన ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

నిధులు నిల్.. మాటలు ఫుల్..!

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో జిల్లా అభివృద్ధికి నిధులు లేవు. నిధులు నిల్, మాటలు ఫుల్ అన్నట్లుగా బడ్జెట్ ఉంది. హెచ్ఎల్‌సి ఆధునీకరణ, హంద్రీనీవా వెడల్పు, జీడిపల్లి నుంచి చేపట్టిన భైరవానితిప్ప, ఉంతకల్లు జలాశయ నిర్మాణం లాంటి పథకాలకు నిధులు నామమాత్రంగా కేటాయించారు. హంద్రీనీవాకు కేవలం రూ.122.69 కోట్లు, తుంగభద్ర కు రూ.193.17 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోవు. హంద్రీనీవా నీటి సరఫరాకు పెద్ద ఎత్తున విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నాయి. కరువులు, వలసలు, రైతుల ఆత్మహత్యల నిలయంగా ఉన్న జిల్లాకు అవసరమైన నిధులు కేటాయించకుండా ఈ సంవత్సరం కూడా జిల్లా రైతాంగాన్ని ప్రభుత్వం దగా చేసింది. రాష్ట్రంలో కరువు ఛాయలు లేవని వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉంది. ఈ ప్రభుత్వమే అనంతపురం జిల్లాలో 28 మండాలను కరువు మండలాలుగా ప్రకటించిన విషయం మంత్రి మరిచిపోవడం విచారకరం. భూముల రీసర్వేపై రైతులు గగ్గోలు పెడుతుంటే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం ఘనంగా చెప్పుకోవడం సిగ్గుచేటుగా ఉంది. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపైనా బడ్జెట్‌లో మాట్లాడలేదు. రాష్ట్రంలో తలసరి విద్యుత్ వినియోగం పెరిగిందని గొప్పలు చెప్పిన ఆర్థిక మంత్రి ఈ కాలంలో ప్రజలపై మోపిన విద్యుత్ ఛార్జీల భారాలపై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉంది.

రైతులకు మొండిచేయి



రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 బడ్జెట్‌లో రైతులకు మరోసారి మొండి చేయి చూపించింది. పంటనష్ట పరిహారం గురించి కనీస ప్రస్తావన చేయలేదు. కరువు పరిస్థితులు లేవని చెప్పడం రైతులను మోసం చేయడమే. జిల్లాలో 31 మండలాల్లోనూ కరువు నెలకొంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వమే 28 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఇలాంటి పరిస్థితుల్లో కరువు సహాయక చర్యలపై బడ్జెట్‌లో ప్రభుత్వం స్పందిచలేదు. ధరల స్థిరీకరణ నిధిని రూ.3 వేల కోట్లతో ఏర్పాటు చేశామని చెప్పారే గానీ, ఎంత ఖర్చు చేసింది చెప్పలేదు. వైసిపి రైతు ప్రభుత్వం చెప్పుకోవడం తప్పా ఆచరణలో అన్నదాతకు చేసింది ఏమీ లేదు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకూ నిధులు కేటాయించలేదు. హెచ్ఎల్‌సి ఆధునీకరణ, హంద్రీనీవా వెడల్పు, భైరవానితిప్ప, ఉంతకల్లు జలాశ నిర్మాణాలకు నిధులు నామాత్రంగా కేటాయింపులు చేశారు. కేటాయించిన డబ్బులు అధికారుల జీతభత్యాలకు కూడా సరిపోని పరిస్థితి ఉంది.

ఆర్.చంద్రశేఖర్ రెడ్డి,
ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

పంట నష్టపరిహారం... మాటలకే పరిమితమా..?

కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

◆ వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి
◆ పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇవ్వాలి
◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మాటలకే పరిమితం అయ్యిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. జిల్లాలో రైతులకు పంట నష్టపరిహారం, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం నాడు ధర్నా నిర్వహించారు. అంతకు మునుపు రైతులు, పేదలతో కలిసి సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో రాంభూపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ కాలేదన్నారు. సంక్రాంతి పండుగ నాటికి చెల్లిస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదన్నారు. జిల్లాలో 6 లక్షల ఎకరాల్లో పంట సాగు కాగా రూ.6వేల కోట్లను రైతులు పెట్టుబడి రూపంలో నష్టపోయారని తెలిపారు. వ్యవసాయ అధికారులు 1,79,815 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని అంచాన వేసి కేవలం రూ.300 కోట్లు మాత్రమే నష్టం జరిగినట్లు అంచనాలు వేయడం విచారకరం అన్నారు. ఇది రైతులను తీవ్రంగా దగా చేయడమే అన్నారు. వేరుశనగ పంట సాగుకు ఎకరాకు కనీసం రూ.35 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు వస్తుందన్నారు. ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.6 వేలు నష్టపరిహారంగా నిర్ణయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇతర పంటల విషయంలో కూడా ఇదే రకమైన తక్కువ పరిహారాన్ని చూపి రైతులను మోసం చేస్తున్నారన్నారు. పంటలు సాగు చేసి రూ.6 వేల కోట్లు జిల్లా రైతులు నష్టపోతే కేవలం రూ.251 కోట్లు నష్టపరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించడం అన్నదాతలను నిలువునా మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కౌలు రైతులను గుర్తించి, వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు.

గ్రామాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో పట్టణాలు, మండల కేంద్రాలకు పేదలు వలసలు వస్తున్నారని తెలిపారు. వీరు ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుంటే వెంటనే నకిలీ పట్టాదారులు అధికారులను ఉపయోగించి ఖాళీ చేయిస్తున్నారని తెలిపారు. వీరికి అధికార పార్టీ నాయకులు కొందరు అండగా ఉంటున్నారని విమర్శించారు. అనంతపురం రాజీవ్ కాలనీ పంచాయతీలో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి రక్షణ కల్పించాలన్నారు. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో ఇళ్లను తొలగించిన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్ర శేఖర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, ఎస్.నాగేంద్రకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముస్కిన్, మండల నాయకులు చెన్నారెడ్డి, మసూద్, ప్రకాష్, వెంకటేష్, శ్రీనివాసులు, రాజు, నల్లప్ప, సంగప్ప పాల్గొన్నారు.

పంచాయతీరాజ్‌లో సిమెంట్ గోల్‌మాల్

అధికారులపై కాంట్రాక్టర్ల ఆగ్రహం

ప్రజాశక్తి- కుందుర్పి

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు మంజూరు చేసిన సిమెంట్ వినియోగంలో కుందుర్పి మండల పంచాయతీ రాజ్ అధికారులు పెద్ద ఎత్తున గోల్‌మాల్ చేశారనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి. కుందుర్పి మండల వ్యాప్తంగా గత రెండు సంవత్సరాల నుంచి ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ఇదే సమయంలో నిర్మాణ పనులకు సంబంధించి వచ్చిన సిమెంట్ బస్తాలను పంచాయతీరాజ్ అధికారులు పక్కదారి పట్టించారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇలా మండల వ్యాప్తంగా దాదాపు 30 నుంచి 40 వేల దాకా సిమెంట్ బస్తాల గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై కాంట్రాక్టర్లు బహిరంగంగా అధికారులపై విమర్శలు చేస్తున్నారు. ఇదే విషయంపై రెండు రోజుల క్రితం మండలంలో పర్యటించిన ఎంపీ తలారి రంగయ్య దృష్టికి కాంట్రాక్టర్లు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎంపీ పంచాయతీ రాజ్ డిఈ రాజన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిమెంట్ బస్తాలకు సంబంధించి ఎలాంటి గోల్‌మాల్ జరగలేదని పంచాయతీరాజ్ అధికారులు, జరిగిదంటూ కాంట్రాక్టర్లు ఎంపీ సమక్షంలోనే వాదులాడుకున్నారు. మండల వ్యాప్తంగా చూస్తే 13 గ్రామ పంచాయతీల పరిధిలో 16 సచివాలయాలు, ఆర్‌బికె భవన నిర్మాణాలు ప్రారంభం అవగా ఇందులో కేవలం మూడు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన వాటి నిర్మాణాలు అన్నీ వివిధ స్థాయిల్లోనే నిలిచిపోయాయి. భవన నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో జరగనప్పుడు సిమెంట్ బస్తాలు ఎక్కడికి వెళ్లాయనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సిమెంట్ గోల్‌మాల్‌పై జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి విచారణ జరిపిస్తే అవినీతి వాస్తవాలు బహిర్గతం అవుతాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

పంచాయతీరాజ్ డీఈ రాజన్నను నిలదీస్తున్న కాంట్రాక్టర్లు

10న అనంతకు సుప్రీంకోర్టు జడ్జిల రాక

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 10వ తేదీన జిల్లాకు సుప్రీంకోర్టు జడ్జిలు రానున్నారు. ఈ నేపథ్యంలో జడ్జిట పర్యటనకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 10వ తేదీన అనంతపురం జెఎన్‌టియు ఎన్టీఆర్ ఆడిటోరియంలో బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించే 'ఫర్ యంగ్ అడ్వకేట్స్' కార్యక్రమంలో పాల్గొనేందుకు సుప్రీంకోర్ట్ ఆఫ్ ఇండియా జడ్జి జస్టిస్ అశానుద్దీన్ అమానుల్లా ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. గౌరవ అతిథులుగా న్యూఢిల్లీ, సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా జడ్జి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యూఢిల్లీ సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా జడ్జి గౌరవ జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సుప్రీంకోర్టు ఛైర్మన్, సీనియర్ అడ్వకేట్ మనన్‌కుమార్ మిశ్రా పాల్గొంటారన్నారు. వీరితో పాటు ఆరుగురు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జీలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా హాజరవుతారన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిలు జిల్లాకు రానున్న నేపథ్యంలో ప్రోటోకాల్ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాన్వాయ్ ఏర్పాటుపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. కాన్వాయ్‌లో అంబులెన్స్, స్పెషలిస్ట్ డాక్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. జెఎన్‌టియులో కార్యక్రమం పూర్తయ్యే వరకు నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్, డిఆర్ఒ జి.రామకష్ణారెడ్డి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఏ.రామిరెడ్డి, అడ్వకేట్లు హరినాథ్ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో

అధికారులు, పాలకవర్గం విఫలం : టిడిపి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో గత వారం రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు, పాలకవర్గం పూర్తిగా విఫలం అయ్యిందని టిడిపి నాయకులు విమర్శించారు. బుధవారం నాడు నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మాజీ కార్పొరేటర్ సరిపుటి రమణ, అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, నగర కార్యదర్శి ముక్తియార్‌లు మాట్లాడుతూ నగరంలోని 50 డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొందన్నారు. వేసవికాలం రాకమునుపే ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రజలకు నీటిని అందించడంలో కార్పొరేటర్లు విఫలం అయ్యారన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించామన్నారు. పరిస్థితి జఠిలంగా ఉన్నా ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సుధాకర్ నాయుడు, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఫలించిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి కృషి

ఉరవకొండ-బళ్లారి మధ్య బస్సుల నడిచేలా జీవో జారీ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కృషి వల్ల ఎపి-కర్నాటక రాష్ట్రాల(ఉరవకొండ-బళ్లారి) మధ్య అంతర్రాష్ట్ర రవాణా అనుమతులను పునరుద్ధరిస్తూ ఎపి ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ జీవో జారీ చేసింది. అంతర్రాష్ట్ర రవాణా అగ్రిమెంట్ రెన్యువల్ కాని కారణంగా ఈ మార్గంలో బస్సులు నడవడం లేదు. తద్వారా పాల్తూరు, హావళిగి, ఉండబండ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఇరు రాష్ట్రాల రవాణా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అగ్రిమెంటును రెన్యువల్ చేసి ఈ మార్గంలో బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని రవాణా అధికారులు, సంబంధిత మంత్రివర్గ సభ్యులకు ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి పలుమార్లు విన్నవించారు. ఆయన కృషి ఫలించి బళ్లారి-ఉరవకొండ మధ్య రెండు బస్సులు (ప్రతిరోజూ 8 ట్రిప్పులు) తిరిగేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ జీవో జారీ చేయడం పట్ల అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో జెసి.దివాకర్‌రెడ్డి పర్యటన

తన మద్దతుదారులతో మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డి

పెద్దపప్పూరు : మండలంలోని దేవుని ఉప్పలపాడు, చిన్న ఎక్కలూరు గ్రామాల్లో బుధవారం మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి పర్యటించారు. ఆయా గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అను చరుల ఇళ్లకు వెళ్లి వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో జెసి కుటుంబానికి సహకరించాలని కోరారు. అంతకుముందు జెసికి అభిమానులు పూలమాలలతో స్వాగతం పలికారు. ఆయన వెంట సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మాధవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి ఉన్నారు.

వైసిపి పాలనలో పేదల జీవితాలు దుర్భరం : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి పాలనలో నిరుపేదల జీవితాలు దుర్భరంగా మారాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. కాలవ బుధవారం పట్టణంలోని 9వ వార్డులో పద్మశాలి వర్గానికి చెందిన ముఖ్యులను కలిశారు. వైసిపి పట్టణ కన్వీనర్ శివప్ప సోదరుడు అరవ శ్రీనివాసులుతో పాటు 40 కుటుంబాలు టిడిపిలో చేరగా వారికి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కాలవ మాట్లాడుతూ వేసవికి ముందే పట్టణంలో విద్యుత్ కోతలు ఎక్కువ య్యాయని, తద్వారా గార్మెంట్స్ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 'నేతన్న నేస్తం'లో భారీగా కోతలు పెట్టారన్నారు. తాను గెలిచాక రాయదుర్గంలో ఆగిపోయిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తం, డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇనాయత్, నాగరాజు, తిప్పేస్వామి, వెంకటేశులు, కుమార్, బసవరాజు, ఖలందర్ పాల్గొన్నారు

టిడిపిలో చేరిన వారికి కండువా వేస్తున్న కాలవ శ్రీనివాసులు

వైసిపి అరాచకాలు, అక్రమాలను ఎండగట్టండి

వైసిపి పాలనలో జరుగుతున్న అరాచకాలు, అక్రమాలను సోషల్ మీడియా వేదిక ద్వారా ఎండగట్టాలని కాలవ బిఎల్ఎలకు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో పట్టణ, రూరల్ బిఎల్ఎలు, యూనిట్ ఇన్‌ఛార్జులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి బిఎల్ఎలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ పోతుల నరసింహులు, టి.స్వప్న, కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, హనుమంతు, సిద్దప్ప, పురుషోత్తం, ఇనాయత్ పాల్గొన్నారు

ఉదయం అలా.. సాయంత్రం ఇలా..

టిడిపి కండువా కప్పుకొని మాట మార్చిన వైసిపి నేత

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి పట్టణ కన్వీనర్ ఆరవ శివప్ప సోదరుడు ఆరవ శ్రీనివాసులు వ్యవహారం బుధవారం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఆయన ఉదయం పట్టణంలోని 9వ వార్డులో పద్మశాలి వర్గాని కి చెందిన ముఖ్యులతో పాటు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు సమక్షంలో పసుపు కండువా వేసుకున్నారు. అయితే సాయంత్రం సోదరుడు శివప్పతో కలిసి శ్రీనివాసులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను టిడిపిలో చేరలేదని, ఉదయం బంధువుల ఇంటి వద్ద ఉండగా బలవంతంగా టిడిపి కండువా వేశారని తెలిపారు. శివప్ప మాట్లాడుతూ తన సోదరుడు శ్రీనివాసులు టిడిపిలో చేరలేదని, అన్నదమ్ముల మధ్య విభేదాలు సృష్టించవద్దని టిడిపి నాయకులను కోరారు. ఇదివరకే టిడిపిలో ఉన్న కార్యకర్తలకు కాలవ శ్రీనివాసులు కండువాలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. వారితో పాటు పద్మశాలి సంఘం నాయకులు శివనాగప్ప, గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

నిప్పు పెట్టిన ఉల్లివామి పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని రామలింగాయపల్లిలో రైతు బ్రహ్మయ్య తన పొలంలో 200 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను నిల్వ ఉంచారు. ఆ పంటకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మొత్తం కాలి బూడిదైంది. విషయం తెలిసి సిపిఎం నాయకులు పొలానికి వెళ్లి కాలిపోయిన పంటను పరిశీ లించి అలాగే బాధిత రైతును పరామర్శించారు. అధికారులు పంట నష్టం అంచనా వేసి రైతును ఆదుకోవాలని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిశీలించిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, భాస్కర్‌రెడ్డి, వ్య.కా.సం. మండల అధ్యక్షుడు పెద్దయ్య, కెవిపిఎస్ నాయకులు నాగభూషణం, జగదీష్, హరి, గోవిందు, రవినాయుడు, గురుమూర్తి ఉన్నారు. బాధిత రైతును ఆదుకోవాలని ఎపి రైతు సంఘం పుట్లూరు మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కి వినతిపత్రం ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో రైతు సంఘం మండల కార్యదర్శి సత్తార్ గోపాల్, గౌరవాధ్యక్షులు టి.బాలగుర్రయ్య, నాయకులు విటి.రామాంజనేయులు, గోపాలకృష్ణ, బుసగాని చిన్న కృష్ణుడు, చిన్న కుళ్ళాయప్ప, బి.ఓబుళరెడ్డి ఉన్నారు.

వైద్యులు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైద్య, ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడానికి అంకిత భావంతో పని చేయాలని వైద్య ఆరోగ్యశాఖ కేంద్ర ప్రభుత్వ రీజినల్ డైరెక్టర్(ఎపి, తెలంగాణ), చీఫ్ ఆఫ్ ఎయిర్‌పోర్ట్ హెల్త్ ఆర్గనైజర్ ఆఫీసర్ అనురాధ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప సూచించారు. 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా పట్టణంలోని ఛంభం స్వామి లేఔట్ పిహెచ్‌సిలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డాక్టర్లకు సూచించారు. గర్భిణులు, బాలింతలకు అందించే సేవలపై ఎప్పటికప్పుడు చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లావణ్య, శ్రీలక్ష్మి, నాయకులు శివ, శ్రీరామ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ సమన్వయకర్త సందేశ్‌కుమార్, డాక్టర్లు హజార్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పామిడి

స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 9వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హెచ్ఎం రామ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు పోలీస్ కాంప్లెక్స్ వరకూ ర్యాలీగా వెళ్లారు. అనంతరం బెంగళూరు బేకరీలో కేక్, బ్రెడ్ తయారీపై బేకరీ నిర్వాహకుడు రాఘవేంద్ర విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ ఒకేషనల్ ఫుడ్ ప్రాసెసింగ్ ట్రేడ్ వల్ల భవిష్యత్తులో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. టైమ్స్ సెంటర్ ఫర్ లర్నింగ్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఒకేషనల్ ట్రైనర్ రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలను సందర్శించడం ద్వారా వాటి పట్ల అవగాహన ఏర్పడి ఉపాధి అవకాశాలు కల్పించుకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, నాగేంద్రమ్మ, రమ్యకృష్ణ, రామతులసి, సత్యం, రంగప్ప, ఆరిఫ్‌బాషా, బాలయ్య, పద్మనాభరెడ్డి, ఆంటోనీ పాల్గొన్నారు.

బెంగళూరు బేకరీ వద్ద విద్యార్థులు

మెరుగైన వైద్య సేవలు అందించండి

బుక్కరాయసముద్రం : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. కొర్రపాడు పిహెచ్‌సిలో బుధవారం ఎంపిపి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. మందుల రవాణా ఖర్చు, ల్యాబ్ పరికరాలు, తదితర వాటికి ఆమోదం తెలిపారు. గ్రామస్తుడు డి.విజయభాస్కర్‌రెడ్డి ఆసుపత్రికి ఎన్ఎస్ 100 ఎం.ఎల్ బాటిల్స్‌ను అందజేశారు. అనంతరం డి.సునీత, డి.విజయభాస్కర్‌రెడ్డి ఈ నెల 9వ తేదీ జరిగే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డా. డి.ఇందిరా ప్రియదర్శిని, డా. ఆర్.వినోద్‌కుమార్, సిహెచ్ఓ టి.మోహన్‌బాబు, హెచ్ఇ ఎం.పర్వీన్, సూపర్‌వైజర్లు శ్రీదేవి, కేశవయ్య, స్టాఫ్ నర్స్ మంజుల, ఫార్మాసిస్ట్ శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ కరుణాకర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే బెస్తల అభివృద్ధి

శింగనమల : రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వంతోనే బెస్తలు అన్ని రకాలుగా అభివద్ధి చెందారని టిడిపి బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రామ్‌ప్రసాద్ తెలిపారు. 'బిసి బెస్తల భరోసా బాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సాయిబాబా గుడి వద్ద రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ రాష్ట్ర సభ్యులు చేపల హరి, బెస్త నారాయణస్వామి, బెస్త రమేష్, క్రిష్ణమూర్తి అధ్యక్షతన టిడిపి బెస్త నాయకులతో సమావేశం నిర్వహించారు. టిడిపి పాలనలో బెస్తలకు జరిగిన అభివృద్ధి, వైసిపి హయాంలో బెస్తలకు జరిగిన అన్యాయాన్ని వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో బెస్త సాధికార కమిటీ సభ్యులు బెస్త చిన్న ఆంజనేయులు, బెస్త వెంకటేష్, పోలి సాయి, శంకర్, పాపన్న, ఓబులేసు, ప్రసాద్, బెస్త లక్ష్మణస్వామి, విజయ్, సురేష్, సుభాష్ పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

పెద్దవడుగూరు : మండలంలోని లక్ష్మంపల్లిలో బుధవారం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రవీంద్ర, గుత్తి ఎడిఎ వెంకటరాముడు, ఎఓ మల్లీశ్వరి, డిటి శంకరయ్య, ఇఎఓలు సునీత, రజని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటా జొన్నలు రూ. 3,225 చొప్పున, కందులు రూ. 9,370 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధరలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ తెలిపారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడుదాం

బుక్కరాయసముద్రం : వైసిపి పాలనకు చరమగీతం పాడుదామని జనసేన పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో బుధవారం మండలంలోని అన్ని పంచాయతీల బూత్ స్థాయి నాయకులతో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలను చైతన్యం చేసి జనసేన, టిడిపి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. బూత్ స్థాయిలో జనసేనపార్టీని బలోపేతం చేయడంపై చర్చించారు. వైసిపి అరాచక పాలనలో నియోజకవర్గం బాగా వెనుకబడిందని, దళితులపై దాడులు పెరిగాయన్నారు. జనసేన-టిడిపి ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యం గా పని చేసి నియోజక అభివృద్ధికి పాటుపడాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త సాకే మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, కార్యదర్శి చొప్ప చంద్ర, నాయకులు కృష్ణమూర్తి, విజయలక్ష్మి, మండల అధ్యక్షులు జి.ఎర్రిస్వామి, శశిరేఖ, శ్రీకాంత్ రెడ్డి, తాహిర్, చరణ్, ముని, విశ్వనాథ, శివ, మహేంద్ర, కామేష్, తాతయ్య, సోమశేఖర్, వెంకటేష్, విజయభాస్కర్, లక్ష్మీనారాయణ, నాగరాజు, శేఖర్, నాగేంద్ర, హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వప్రయోజనాలే లక్ష్యంగా వైసిపి బడ్జెట్

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

అనంతపురం : వచ్చే ఎన్నికల్లో స్వప్రయోజనాలు చేకూరే విధంగా వైసిపి ప్రభుత్వం బడ్జెట్ రూపొందించిందే తప్ప ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదని జనసేనపార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ విమర్శించారు. అసెంబ్లీలో బుధవారం ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. అనంత జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రధానంగా హెచ్ఎల్‌సి ఆధునీకరణను విస్మరించిందన్నారు. వివాదాస్పదమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పట్ల మంత్రి గొప్పలు చెప్పుకోవడం దుర్మార్గపు చర్య అన్నారు. జనసేన-టిడిపి ప్రభుత్వం స్థాపన ద్వారానే ప్రజామోదమైన బడ్జెట్ సాధ్యమవుతుందన్నారు.



రక్తదానం చేస్తున్న గేట్స్ కళాశాల డైరెక్టర్ వికె.శ్రీవాణి

'గేట్స్'లో రక్తదాన శిబిరం

గుత్తి : పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అనంతపు రంలోని సర్వజన ఆసుపత్రి నిర్వహణ అధికారుల అభ్యర్థన మేరకు గేట్స్ యాజమాన్యం కళాశాలలో శిబిరం ఏర్పాటు చేయగా వంద మంది విద్యార్థులు రక్త దానం చేశారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ సుభాష్(హౌస్ సర్జన్), ల్యాబ్ టెక్నీషియన్స్ ఆధ్వర్యం లో శిబిరం నిర్వహించారు. ముందుగా కళాశాల డైరెక్టర్ వికె.శ్రీవాణి, ఎండి గజ్జల రఘునాథరెడ్డి, రక్తదా నం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ సురయ, మానవతా రక్త దాతల సంస్థ ప్రతినిధి అమరనాథ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9న ఉచిత వైద్య శిబిరం

రాయదుర్గం : పట్టణంలోని తేరువీధి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ నెల 9వ తేదీ ఛేంజ్ ఫర్ సొసైటీ, స్టీల్ ప్లాంట్ సాధన సమితి సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు స్టీల్ ప్లాంట్ సాధన సమితి అధ్యక్షులు నాదల్ ఓ ప్రకటనలో తెలిపారు. వెంట ఆధార్, ఆరోగ్యశ్రీ, రేషన్‌కార్డులు, 2 ఫొటోలు తీసుకురావాలన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ 6వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం తాటిచెర్ల గ్రామానికి చెందిన సుబ్బమ్మ కుమార్తె తులసి వివాహానికి రూ. 15వేల విలువ చేసే 24 రకాల నిత్యావసర సరుకులు, పెళ్లి కుమార్తెకు చీర, గాజులు దాతల సహకారంతో అందజేసినట్లు ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ నిర్మలమురళి తెలిపారు. కార్యక్రమంలో కవిన్ ఆదిత్య, సౌధామణి, అనూష, గంగోత్రి, వేణు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపిడిఓ శ్రీనివాసులు సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. కుల గణన సర్వే గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇఒఆర్‌డి శివాజీరెడ్డి ఉన్నారు.

12న టెంకాయల విక్రయ హక్కుకు వేలం

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి ఆలయం వద్ద టెంకాయల విక్రయ హక్కు కోసం ఈ నెల 12వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి వి.దేవదాసు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు రూ. 5వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

జగన్ ప్రభుత్వానికి సర్పంచుల తడాఖా చూపిస్తాం

శింగనమల : 'చలో అసెంబ్లీ' ముట్టడి మొదటిది మాత్రమేనని, ముందుముందు జగన్ ప్రభుత్వానికి సర్పంచుల తడాఖా ఏంటో చూపిస్తామని పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి బుధవారం ఓ ప్రకటలో హెచ్చరించారు. 'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమాన్ని విజయ వంతం చేసిన సర్పంచులకు కృతజ్ఞతలు తెలిపారు. 3.5 కోట్ల గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు రాజీలేని పోరాటాలు చేస్తాం.. ఉద్యమాన్ని ఉధృతం చేసి జగన్ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.

'మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలి'

ప్రజాశక్తి-శింగనమల

తోట ఓబులేసు

మినీ డీఎస్సీ వద్దు.. మెగా డీఎస్సీ కావాలని మండల జనసేనపార్టీ అధ్యక్షులు తోట ఓబులేసు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు పది లక్షల మందికి పైగా టెట్ క్వాలిఫై అయిన నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రస్తుతం 35వేల పోస్టులు ఖాళీగా ఉంటే జగన్ ప్రభుత్వం కేవలం 6,100 పోస్టులకు మాత్రమే డీఎస్సీ ప్రకటించడం బాధాకరం అన్నారు. వైసిపి ప్రభుత్వం ఏనాడూ నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. 2024లో జనసేన, టిడిపి ప్రభుత్వం ఏర్పాటవుతుందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా పాలన ఉంటుందన్నారు.

త్వరలోనే తాగునీటి సమస్యకు పరిష్కారం : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మోటార్ల మరమ్మతులకు చర్యలు చేపట్టామని, త్వరలోనే తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని మేయర్ మహమ్మద్ వసీం ఆశాభావం వ్యక్తం చేశారు. నగరానికి తాగునీరందించే పిఎబిఆర్ డ్యామ్ పంపింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్ రెడ్డితో కలిసి పరిశీలించి నీటి పంపింగ్ విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ పంపింగ్ కేంద్రంలో 4 మోటార్లు ఉండగా 3 కాలిపో వడంతో నీటి సరఫరాకు కొంతమేర ఇబ్బంది తలెత్తింద న్నారు. కాలిపోయిన మోటార్లను త్వరితగతిన మరమ్మతులు చేయించి సోమ, మంగళవారాల్లో నగరవాసులకు పూర్తి స్థాయిలో తాగునీరందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్య తలెత్తకుండా అత్యాధునిక మోటార్ల ఏర్పాటుకు కంపెనీల నుంచి కొటేషన్లు ఆహ్వానించామన్నారు. త్వరలోనే నూతన మోటార్ల కొనుగోలుకు టెండర్లు పిలుస్తామన్నారు. హైదరాబాద్ జిహెచ్ఎంసి నుంచి వచ్చిన ప్రతినిధితో అత్యాధునిక మోటార్ల ఏర్పాటుపై చర్చించారు. వారి వెంట ఇన్‌ఛార్జి ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, కార్పొరేటర్లు ఉన్నారు.

మోటార్లను పరిశీలిస్తున్న మేయర్ వసీం, తదితరులు

జగన్ పాలనలో రైతుల కంట కన్నీరు

ప్రజాశక్తి-పుట్లూరు

వైసిపి ప్రభుత్వం రైతుల కంట కన్నీరు పెట్టిస్తుందని శింగనమల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. మండలంలోని రామలింగయ్యపల్లిలో టిడిపి నాయకుడు, రైతు బ్రహ్మయ్య నష్టపోయిన ఉల్లిగడ్డ పంటను బుధవారం ఆమె స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించా రు. ఆమె మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టపడి పంటలు పండిస్తుంటే, జగన్ పాలనలో అరాచక శక్తులు పంటలను తగలబెట్టడం, చేతికొచ్చిన చెట్లను నరికివేయడం దుర్మార్గమన్నారు. రైతులను పట్టించుకోని సిఎం జగన్ తమది రైతు ప్రభుత్వమని చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఆమె వెంట నాయకులు గోవర్ధనరాజు, రామమునిరెడ్డి, రవి, రవిచంద్రనాయుడు, రామచంద్రనాయుడు, తాజ్, శివారెడ్డి, డిసి ఓబుళనాయుడు ఉన్నారు.

కాలిపోయిన ఉల్లి పంటను పరిశీలిస్తున్న శ్రావణిశ్రీ

నార్పల ప్రత్యేకాధికారిగా రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-నార్పల

మండల ప్రత్యేక అధికారిగా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ జి.రామసుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈ స్థానంలో ఉన్న మహమ్మద్ రఫీ ఆయన మాతృశాఖ అయిన ఆరోగ్యశాఖలోకి కడప జిల్లా కు వెళ్లారు. నూతన స్పెషల్ ఆఫీసర్ బుధవారం ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డితో కలిసి పలు కార్యా లయాలను సందర్శించారు. తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ రాముడు విధి నిర్వహణలో భాగం గా అనంతపురం వెళ్లడంతో ఆయా కార్యాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో కలిసి మండలాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన ఎంపిడిఒ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై పాఠశాల, వైద్య, ఐసిడిఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఇఒలు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, హెల్త్ సూపర్వైజర్, అంగన్వాడీ వర్కర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.రామసుబ్బారెడ్డి సన్మానిస్తున్న అధికారులు

రూ. 87.9 లక్షలు పలికిన దినసరి సంత మార్కెట్

అనంతపురం కార్పొరేషన్ : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దినసరి సంత మార్కెట్‌లో 2024-25కి గానూ సుంకం వసూలు చేసుకోవడానికి బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో కాంట్రాక్టర్లు విజయ్‌కుమార్, నారాయణస్వామి పాల్గొన్నారు. లారీల నుంచి సుంకం వసూలు కావడం లేదని, నిర్దిష్ట చర్యలు చేపట్టిన తర్వాతే టెండర్ నిర్వహించాలని విజయ్‌కుమార్ పట్టుబట్టారు. అయితే పుట్టపర్తికి చెందిన కాంట్రాక్టర్ నారాయణస్వామి సర్కార్ సవాలు రూ. 79 లక్షల నుంచి వేలం పాట ప్రారంభించగా వారిద్దరూ పోటీ పడ్డారు. చివరకు విజయ్‌కుమార్ రూ. 87.90 లక్షలకు దక్కించుకున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు గతేడాది కంటే రూ. 11.30 లక్షల ఆదాయం పెరిగింది.

పారిశుధ్య కార్మికుల నూతన కమిటీ ఎన్నిక

అనంతరం కార్పొరేషన్ : స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ జిమ్ ఆవరణలో బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావే శంలో మున్సిపల్ కార్పొరేషన్ రెగ్యులర్ కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రెగ్యులర్ కార్మికుల అభిప్రాయం మేరకు సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ ఆధ్వర్యంలో నగర అధ్యక్ష, కార్యద ర్శులుగా ఎల్.ముత్తురాజు, ఎం.నల్లప్ప, కోశాధికారిగా నారాయణస్వామి, సభ్యులుగా మరియమ్మ, రాజ మ్మ, గంగాలక్ష్మి, మల్లేశు, పెద్దక్క, ఆనంద్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఆదినారాయణ, పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపునకు కృషి

ఉరవకొండ : విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గడేకల్ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం 8వ తరగతి విద్యార్థులకు ఎంపిపి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చారన్నారు. వైసిపి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో హెచ్ఎం సాయికుమారి, ఉపాధ్యాయులు శేషఫణి, ఓబుల్‌రెడ్డి, నీలకంఠ పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్లకు అవగాహన

రాయదుర్గం : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బుధవారం పట్టణంలోని మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో మ్యాక్స్, మోటార్ క్యాబ్ వాహన డ్రైవర్లు, యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ఎంవిఐ అటికనాజ్ మాట్లాడుతూ వాహనం నడిపేట ప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పర్మిట్, ఎఫ్‌సి, ఇన్సూరెన్సు, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు పునరుద్ధరీకరణ చేయించుకోవాలన్నారు. ప్రయివేట్ వాహనాలను వాణిజ్య వాహనాలుగా వాడరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యాలయ సహాయకులు శ్రీనివాస్, వాహనాల డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు .

నులిపురుగులను నివారిద్దాం

ఉరవకొండ : నులి పురుగులను నివారించి చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎంపిపి నరసింహులు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సం సందర్భంగా బుధవారం పోస్టర్లు ఆవిష్కరించి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. రాకెట్ల, పెద్దకౌకుంట్ల వైద్యాధికారులు వెంకటేష్ నాయక్, అనికేత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపిపి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. 1 నుంచి 18 ఏళ్ల పిల్లలకు 9వ తేదీ మధ్యాహ్నం భోజనం తరువాత ఈ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు ఎస్ఎండి.షఫీ, ఎంవి.రమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ తిరుపాల్, రాజమ్మ, హెల్త్ అసిస్టెంట్ నిమ్మల వెంకటేష్, రఘునాథ, సిఒ భగవాన్‌దాస్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'పరిటాల' కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తే సహించం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం చేసిన అభివృద్ధిపై తాము ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధమని, వైసిపి పాలనలో జరిగిన అభివృద్ధిపై మీరు చర్చకు సిద్ధమా అని ఆత్మకూరు మండల నాయకులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి సవాల్ చేశారు. ఆత్మకూరులోని టిడిపి కార్యాలయంలో బుధవారం మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పరిటాల కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. అమ్మ పాల డెయిరీ ఏర్పాటుకు అంత సొమ్ము ఎలా వచ్చిందో, కార్యాకలాపాలు, జాకీ పరిశ్రమ, తదితర వాటిపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సొంత పార్టీ నాయకులకు రాజకీయ పదవులు ఇచ్చేందుకు పెద్దఎత్తున ముడుపులు తీసుకున్నది వాస్తవం కాదా అని నిలదీశారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరుల అవినీతి, అక్రమాలను ఎండగట్టారు. సమావేశంలో మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, నాయకులు మనోరంజని, వాల్మీకి కందల ఓబులు, వెంకటేశులు, పూల ఓబుళపతి, బొమ్మయ్య, గోపి, రామదాసు, అక్కులప్ప, గాలి నరసింహులు, నరసింహారెడ్డి, గ్యాస్ శ్రీనివాసులు, ఆదెప్ప, హనుమంతు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ శ్రీనివాసులు

తాడిపత్రి రూరల్ ఎస్ఐగా సాగర్

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ ఎస్ఐగా జి.సాగర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న గౌస్ మహ్మద్ గార్లదిన్నెకు బదిలీ కాగా, అక్కడ పని చేస్తున్న జి.సాగర్‌ను ఇక్కడికి వచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో మండలంలో శాంతి భద్రతలు కాపాడటంతో పాటు చట్టవ్యతిరేకమైన పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గంగవరం సమీపంలో గొర్రెలు చోరీ

బెలుగుప్ప : మండలంలోని గంగవరం గ్రామ సమీప పొలాల్లో మేపడానికి బాల వెంకటాపురం గ్రామానికి చెందిన ఆదినారాయణ గొర్రెలు తీసుకెళ్లాడు. బుధవారం ఉదయం గొర్రెల కాపరి అక్కడికి వెళ్లి చూడగా 22 గొర్రెలు, ఓ పొట్టేలు లేవని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ శివ తెలిపారు. ఎత్తుకెళ్లిన వాటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

తక్కలపల్లి వాటర్ ప్లాంట్‌లో నగదు..

పుట్లూరు : మండలంలోని తక్కలపల్లి గ్రామం వాటర్ ప్లాంట్‌లో చోరీ జరిగినట్లు బాధితుడు గురువయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువయ్య వివరాల మేరకు.. తక్కలపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నానని, రోజులాగే ప్లాంట్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లి భోజనం చేసుకుని రాత్రి 11 గంటల సమయంలో ప్లాంట్ వద్దకు రాగా తలుపు కీళ్లను తొలగించి ఉండడం గమనించానన్నారు. అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా ప్లాంట్‌లో ఉంచిన రూ. 50వేలతో పాటు ప్లాంట్ ముందు గూడులో ఉంచిన 2 నాటుకోళ్లు కనిపించలేదని తెలిపారు.

మద్యం స్వాధీనం.. విక్రేత అరెస్టు

పుట్లూరు : మండలంలోని కుమ్మనమాల గ్రామ సమీపంలో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు చేసి కేశవనాయుడును అదుపులోకి తీసుకొని 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

పేకాట జూదరులు అరెస్ట్

బొమ్మనహాల్ : మండలంలోని కురవల్లి గ్రామం వద్ద పేకాట ఆడుతుండగా సిబ్బందితో కలిసి దాడులు చేసి 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 23,400 స్వాధీనం చేసుకు ని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలో పేకాట, మట్కా, కర్నాటక మద్యం రవాణా, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవన్నారు. వీరిని త్వరలో కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

In The Court of The MACT Ist Addl. District Judge, Ananthapuramu
I.A. No:131/2022 in M.V.O.P. No:20/2020
Between:
Alipeera and others ...petitioners
And
N.Arlappa (Died by L.Rs) N.Mahesh and others ...Respondants
Notice to Respondant No:4
R4:
N.Mahesh S/o Late Arlappa, Owner of The Crime Vehicle Reg No:AP-02-BQ-6805, R/at D.No:8-765, Marempalli (V), Kalyanadurgam (M), Ananthapuramu (Dist).
పై నెంబరు కేసులో 4వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 14/02/2024 వ తేది ఉదయం 10:30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
B.ANAND KUMAR, ADVOCATE, ANANTHAPURAMU.CELL:9441180868

In The Court of The Prl. District Judge, Ananthapuramu
Tr.Cr.M.P. No:9/2023
(In the Matter of Transfer of C.C.No:418/2018 Pending on The File of Spl.Judicial Megistrate to Try Prohibition and Excise Cases, Ananthapuramu To Spl.Judge to Try offences against Women, Ananthapuramu to Try along With S.C.220/2015)
Between:
Kottala Kondaiah and others ...petitioners
And
State Rep.by Public Prosecutor Ananthapuramu and others ...Respondants
Notice to Respondant No:30
R30: Chitrachedu Nagaraju S/o Girappa, R/at Peravali (V), Singanamala (M), Ananthapuramu (Dist).
పై నెంబరు కేసులో 30వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 22/02/2024 వ తేది ఉదయం 10:30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
LAKSHMI PRASAD NAYUNI GARI, ADVOCATE, ANANTHAPURAMU. CELL:9440889979

In The Court of The IInd Addl. Junior Civil Judge, Ananthapuramu
O.S. No:227/2022
Between:
Molakala Vengamma ...Plaintiff
And
The State of Andhra Pradesh, Rep by its District Collector, Ananthapuramu and others ...Defendants
Notice to Defendant No:6
D6:
Puchakayala Narayana S/o P.Sunkanna, R/at Gotukuru (V), Kuderu (M), Ananthapuramu (Dist).
పై నెంబరు కేసులో 6వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 01/03/2024 వ తేది ఉదయం 10:30 గంllలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
LAKSHMI PRASAD NAYUNI GARI, ADVOCATE, ANANTHAPURAMU. CELL:9440889979